



మృత్యు సంకీర్తన

పరంధామా.. ఇంత ఘోరమా..!

గుండె పగిలిన శ్రీకృష్ణ భక్తులు

- ఆరుగురిని మింగిన ప్రమాదం
- నాయనపల్లి క్రాస్ వద్ద ఘోరం
- టైరు పేలి.. లారీని ఢీకొన్న కారు



స్వామివారి సంకీర్తనలను పాడి.. తన్మయత్వంతో తిరుగు ప్రయాణమైనవారిని మృత్యువు కబళించింది. టైరు పేలడంతో అదుపు తప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. వారిని కాపాడే అవకాశం స్థానికులకు లభించలేదు. క్షణాల్లో అందరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. సహాయక చర్యలు చేపట్టేందుకూ వీలు లేనంతగా లారీ కింద కారు ఇరుక్కుపోయింది. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో గంటపాటు శ్రమిస్తేగానీ మృతదేహాలను వెలికి తీయలేకపోయారు. ఈ ప్రమాదం మృతుల ఆప్తులు, శ్రీకృష్ణ భక్తులను దుఃఖ సాగరంలో ముంచింది. 'నిత్యం నీ ధ్యాసలోనే గడిపే భక్తులను ఇంత ఘోరంగా తీసుకెళ్లావా పరంధామా..' అని కంటతడి పెట్టుకున్నారు. తెల్లటి దుస్తులు, నుదుట స్వామి వారి తిరునామం, చెరగని చిరునవ్వులే ఆభరణాలుగా కనిపించే భక్తులు.. రక్తం పులుముక్కున్న దుస్తులతో అచేతనంగా కనిపించడాన్ని జీర్ణించుకోలేకపోయారు. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన ఘోరం ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

- శింగనమల/అనంతపురం రూరల్/కల్చరల్

వివరాలు మెయిన్‌లో.. 7లో..



బాధితులకు పరిటాల సునీత అండ

ప్రమాదం గురించి తెలియగానే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, బాధితులను ఓదార్చారు. తనవంతుగా రూ.లక్ష సాయం అందజేశారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌తో మాట్లాడి, త్వరగా పోస్టుమార్టం నిర్వహించేలా చూడాలని కోరారు. రాత్రికే పోస్టుమార్టం నిర్వహించేలా ఏర్పాట్లు చేయించారు. దైవ చింతనలో ఉండేవారు ఇలా ప్రమాదంలో మరణించడం బాధాకరమని అన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి బాధితులకు పరిహారం ఇప్పిస్తామని అన్నారు. నాయకులు పాము రాయి వెంకటేష్, పాములరాయి రఘు, విశ్వనాథ్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

బాధాకరం: ఎమ్మెల్యే దగ్గుపాటి

రోడ్డు ప్రమాదంలో ఇస్కాన్ సేవకులు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. పోలీసులు, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఆధ్యాత్మిక బాటలోకి వెళ్లారని, అలాంటివారి మరణం కలిచివేస్తోందని అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సర్వజన వైద్యశాలకు వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. బాధితులను ఓదార్చారు. రూ.లక్ష సాయాన్ని అందజేశారు.



మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆవేదన కలిగిస్తోంది : వెంకటశివుడు



నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు.

బండారు శ్రావణి దిగ్భ్రాంతి

శ్రీకృష్ణ భక్తుల మృతి పట్ల శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి.. బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పిస్తామని అన్నారు. అనంతపురం-తాడిపత్రి రహదారిలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు, బ్లాక్ స్పాట్స్ గుర్తించి సైన్ బోర్డులును ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

- బుక్కరాయసముద్రం, ఆంధ్రజ్యోతి



ప్రమాద స్థలంలో మృతదేహాలు



లారీలో ఇరుక్కుపోయిన కారు



ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు

మహిళలకు దీపావళి కానుక

29 నుంచి ఉచిత గ్యాస్‌కు బుకింగ్

- పండుగ రోజు పంపిణీ
- నాలుగు నెలలకు ఒకటి.. ఏడాదికి మూడు..
- తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి
- ఫిర్యాదులకు 1967 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు

అనంతపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మరో హామీ నెరవేర్చడానికి సిద్ధమైంది. మహిళలకు ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని నాటి ప్రతిపక్ష నేతగా నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ మేరకు దీపావళి కానుకగా మహిళలకు సిలిండర్లు అందజేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఉచితగ్యాస్ పంపిణీకి సంబంధించి జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది.

● తెల్లరేషన్‌కార్డు.. ఆధార్.. ఉంటేనే..

అనంతపురం జిల్లాలో 7,21,786 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం పథకం కింద 2,26,726, ఉజ్వల పథకం కింద 17,143, నిరుపేదల పథకం (సీఎస్ఆర్) కింద 37,257, జనరల్ కనెక్షన్లు 4,26,775 ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు తెల్లరేషన్ కార్డు, ఆధార్, గ్యాస్‌కనెక్షన్ తమ పేరుమీద ఉన్నవారు మాత్రమే అర్హులు. ఇందులో రేషన్‌కార్డులు ఉన్నవారికి ఆధార్ లింకు ఉందో తెలుసుకోవడానికి ఈకేవైసీ చేయిస్తున్నారు. రెండు నెలలుగా గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు ఈకేవైసీ చేయిస్తున్నారు. ఇప్పటికీ 40 శాతం మంది ఈకేవైసీ చేయించుకోలేదని సమాచారం. ఈకేవైసీ చేయిస్తే ఆధార్‌లింకు ద్వారా వారి ఆర్థిక స్థోమత బయటపడి అనర్హులుగా గుర్తిస్తామని రాలేదనే ప్రచారం జరుగుతోంది. ఈకేవైసీ నిబంధన తప్పనిసరి అని ప్రభుత్వం చెప్పడంలేదని అధికారులు తెలిపారు.



జిల్లాలో మొత్తం

- గ్యాస్ కనెక్షన్లు : 7,21,786
- దీపం : 2,26,726
- ఉజ్వల : 17,143
- సీఎస్ఆర్ : 37,257
- జనరల్ : 4,26,775



● 29 నుంచి బుకింగ్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉచితగ్యాస్ పంపిణీకి 29వ తేదీ నుంచి బుకింగ్ ప్రారంభిస్తున్నారు. గ్యాస్‌కనెక్షన్ ఉండి తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఉన్నవారందరు గ్యాస్‌కు బుక్‌చేసుకోవచ్చు. బుక్ చేసుకునేటపుడు ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, పల్లెలకు 48 గంటల్లో గ్యాస్ సరఫరా చేస్తారు. బుక్ చేసుకున్న వెంటనే ప్రభుత్వం నుంచి 'మీరు ఉచితగ్యాస్‌కు బుక్ చేసుకున్నారు.. ధన్యవాదాలు' అని మెసేజ్ వస్తుంది. తర్వాత 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుంది. ఇపుడు బుక్ చేసుకున్నవారికి దీపావళి పండుగరోజు పంపిణీ చేస్తారు.

● ఏడాదికి మూడు సిలిండర్లు

అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తారు. నాలుగు నెలలకు ఒకసారి మాత్రమే బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. మూడు విడతలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిఏటా ఏప్రిల్ 1 నుంచి జూలై1వరకు మొదటి విడత బుక్‌చేసుకోవాలి. రెండో విడత కింద ఆగస్టు 1 నుంచి నవంబరు 31 వరకు, మూడో విడతగా డిసెంబరు 1 నుంచి మార్చి 31 వరకు గ్యాస్ బుక్‌చేసుకోవచ్చు. సమస్యలు వస్తే లబ్ధిదారులు టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫిర్యాదులు చేయవచ్చు.

అర్హులందరికి ఉచిత గ్యాస్

ప్రభుత్వం ఈ నెల 31న ఉచిత గ్యాస్ పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు జిల్లాలో కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ఉచితగ్యాస్ పంపిణీకి చర్యలు చేపట్టాం. గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్నాం. ఈనెల 29 నుంచి ఉచిత గ్యాస్‌కు బుక్ చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత ఉన్నవారందరికి గ్యాస్ అందజేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. - వెంకటేశ్వర్లు, డీఎస్ఓ

పట్టా స్థలం కబ్జాకు యత్నం

ఎమ్మెల్యే సోదరుల పేరు చెప్పి చదును చేసిన రౌడీషీటర్లు.. ప్రభుత్వ స్థలంపైనా కన్ను



పట్టా చూపుతున్న హేమలత, ఆమె కుటుంబ సభ్యులు



హేమలతకు చెందిన ఖాళీ స్థలం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పట్టా ఇచ్చిన స్థలాన్ని కబ్జా చేసేందుకు రౌడీషీటర్లు యత్నించారు. ఎమ్మెల్యే సోదరుల పేర్లు చెప్పి ఎక్స్‌కవేటర్లతో స్థలాన్ని చదును చేశారు. పట్టణంలో నివాసముంటున్న సుభాష్ భార్య టి.హేమలత అనే మహిళకు 2018 సంవత్సరంలో అప్పటి రెవెన్యూ అధికారులు దోనిముక్కల రోడ్డు ప్రాంతంలోని సర్వేనెంబర్ 585లో 20/40 కొలతలు కలిగిన 143ఏ ప్లాటు నెంబరు పట్టాను అందజేశారు. ఆ స్థలంలో ఆమె అప్పట్లో కొంతభూమిలో ఇంటి నిర్మాణం చేసుకుని మరో 20 అడుగుల స్థలాన్ని భవిష్యత్ అవసరాల కోసం ఖాళీగా ఉంచుకున్నారు. ఆమె స్థలంతో పాటు పక్కన ఉన్న వంద గజాల ప్రభుత్వ స్థలంపై కన్నేసిన రౌడీషీటర్లు శేఖర్, హుసేన్‌తో పాటు స్టోర్ డీలర్ రమేష్ కబ్జా చేసేందుకు శనివారం ఎక్స్‌కవేటర్‌తో పట్టా స్థలం, ప్రభుత్వ స్థలంలో చదును చేయించారు. సమాచారం అందుకున్న హేమలత భర్త సుభాష్ తమ స్థలంలో ఎందుకు చదును చేస్తున్నారని వారిని అడ్డుకున్నాడు. ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు మామ చెప్పాడని, అందుకే ఈ స్థలాన్ని చదును చేస్తున్నామని, మీ వద్ద పట్టా ఉన్నా ఏమీ చేయ్యలేరని వారు బెదిరించారని సుభాష్ తెలిపారు. ఏమైనా ఉంటే శ్రీనివాసులు మామతో మాట్లాడుకోవాలని రౌడీషీటర్లు తమను బెదిరించారని వాపోయారు. ఎమ్మెల్యే సోదరుల పేరు చెప్పి స్థలం కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బాధితురాలు హేమలత, ఆమె భర్త సుభాష్, కుటుంబసభ్యులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు



బొమ్మనహాళ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు వేకువజామునే సుప్రభాత సేవ చేశారు. తర్వాత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి వెండి కవచం, వివిధ రకాల పూలతో అలంకరించారు. తర్వాత నైవేద్యం సమర్పించి ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు, విష్ణుపారాయణం గావించి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు వందలాది మంది దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం



ఇంకెప్పుడు ఇచ్చేది..?



పీఆర్‌లో వాహనాల అద్దె బిల్లుల పెండింగ్

జిల్లా వ్యాప్తంగా రూ.1.34 కోట్ల బకాయి

- రెండేళ్లుగా రూపాయి కూడా చెల్లించని ప్రభుత్వం
- 13 మంది డీఈఈలు, ముగ్గురు ఈఈలకు తప్పని తిప్పలు
- బిల్లుల రాక క్షేత్రస్థాయి పర్యటనలు అంతంతే..
- కూటమి ప్రభుత్వంలోనైనా చెల్లించేరా..?

జిల్లాలో పరిస్థితి ఇలా...

పీఆర్ విభాగంలో డీఈఈలు	: 07
క్వాసీ విభాగంలో డీఈఈలు	: 02
పీఐయూ డీఈఈలు విభాగంలో	: 04
పీఆర్ఐ ఈఈ	: 01
క్వాసీ ఈఈ	: 01
పీఐయూ ఈఈ	: 01
మొత్తం డీఈఈలు, ఈఈలు కలిపి	: 16 మంది
వాహనాల పెండింగ్ బిల్లులు	: 1.34 కోట్లు



అనంతపురం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో వాహనాల అద్దె బకాయిలు కోట్లలో పేరుకుపోయాయి. గత రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో పలువురు డీఈఈలు, ఈఈల క్షేత్రస్థాయి పర్యటనలు అంతంత మాత్రంగానే సాగిన పరిస్థితి. తద్వారా అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో జరగలేదు. కొందరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లకుండానే ఫోన్‌ల ద్వారానే పని కానిచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరైతే కాంట్రాక్టర్ల ద్వారా డీజిల్ వేయించుకుని వెళ్లినట్లు తెలిసింది. ఇంకొందరు నిత్యం కార్యాలయంలోనే కూర్చోని బిల్లులు పెట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తే.. సదరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లి అభివృద్ధి పనులు వేగవంతం చేసే అవకాశం ఉందని ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది.

• రెండేళ్లుగా చెల్లించని బిల్లులు...

అభివృద్ధి పనులు పర్యవేక్షించడానికి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో పని చేస్తున్న ఈఈలు, డీఈఈలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం అద్దె వాహనాలు సమకూర్చింది. అయితే వాటికి నెలవారి అద్దె బిల్లుల చెల్లించలేదు. వాస్తవంగా ఉపాధి హామీ పథకం ద్వారా శాఖకు అడ్మిన్ కింద 3 శాతం నిధులు కేంద్రం ఇస్తుంది. వీటి నుంచి ప్రతి మూడు నెలలకు ఒక సారి అద్దెవాహనాలకు బిల్లులు చెల్లించేవారు. అయితే ఆ నిధులను వైసీపీ సర్కార్ ఇతర పథకాలకు మళ్లించి, వాహనాలకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని ఆశాఖ వర్గాల సమాచారం.

జిల్లా వ్యాప్తంగా రూ.1.34 కోట్ల బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా 2021 నవంబరు వరకు టీసీఎస్ సాఫ్ట్‌వేర్ కింద అధికారులకు ప్రతి మూడు నెలలకు అద్దె వాహనాల బిల్లులు ఎక్కడిక్కడ ఈఈ ల ద్వారా చెల్లించేవారు. అయితే కేంద్రం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయడంతో ఆశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీల ద్వారా ఆశాఖ ఈఎన్‌సీకి వచ్చి ఆ తర్వాత ఈఈల ద్వారా బిల్లులు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తరచూ బిల్లులు పెండింగ్‌లో పడ్డాయనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కేంద్రం మాత్రం ఎప్పటికప్పుడు ఉపాధి హామీ అడ్మిన్ కింద ఇచ్చే 3 శాతం ఆశాఖ ఉన్నతాధికారులకు మంజూరు చేస్తోందని తెలిసింది. అక్కడే వైసీపీ సర్కార్ అసలు కథ నడిపిందని ఆశాఖ వర్గాల సమాచారం. ఉన్నతాధికారుల నుంచి ఈఈలకు రాకుండా నిధులను వైసీపీ సర్కార్ ఇతర పథకాలకు మళ్లించి రెండేళ్లుగా వాహనాలకు అద్దె బిల్లులు మంజూరు చేయకుండా మొండికేసిందని ఆశాఖ వర్గాల సమాచారం. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఈఈలు, డీఈఈల అద్దె వాహనాల బిల్లులకు సంబంధించి రూ.1.34 కోట్లు పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. ఈ బకాయిలను ప్రస్తుత కూటమి కూటమి ప్రభుత్వమైనా చెల్లిస్తుందా..? లేక అలాగే పెండింగ్‌లో పెడుతుందా...? అనే సందేహం అధికారుల్లో వ్యక్తం అవుతోంది. పల్లె పండుగలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 100 కోట్ల గ్రామీణ రోడ్ల పనులను వేగవంతంగా చేయాలంటే అధికారులు ఫీల్డ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి సకాలంలో వాహనాల అద్దె చెల్లించడంతో పాటు పెండింగ్ బకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పెండింగ్ వాస్తవమే




పంచాయతీ రాజ్‌శాఖలో అధికారులకు సంబంధించి అద్దె వాహనాల బిల్లుల పెండింగ్ ఉండటం వాస్తవమే. పీఆర్ఐ, క్వాసీ, పీఐయూ విభాగాల పరంగా ఒక్కొరకంగా పెండింగ్ ఉన్నాయి. ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే బిల్లులు వస్తాయని తెలిసింది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, జిల్లా పంచాయతీరాజ్‌శాఖ

దొరికినంత దోచెయ్..!

విడపనకల్లు సొసైటీలో తారస్థాయికి అవినీతి



విడపనకల్లు కో-ఆపరేటివ్ బ్యాంక్

- 4,863 ఎరువుల బస్తాలు పక్కదారి
- రూ. 44.81లక్షలు స్వాహా
- అవినీతి తేలినా చర్యలు శూన్యం

విడపనకల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్)లో అవినీతి తారస్థాయికి చేరింది. ఈ ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఎవరు అధ్యక్షులు అయినా దోపిడీ మాత్రం ఆగటంలేదు. 2015 నుంచి ఇప్పటి వరకూ సొసైటీ ద్వారా వచ్చిన 4863 బ్యాగుల ఎరువులను పక్కదారి పట్టించారు. తద్వారా రూ. 44.81లక్షలు దోచుకున్నట్లు జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి నిగ్గు తేల్చారు. ఈ డబ్బును రికవరీ చేయాలని ఆదేశించారు. మూడేళ్ల కిందట పాల్తూరు సొసైటీ గోడౌన్‌కు వచ్చిన దాదాపు 600బ్యాగుల ఎరువులు పక్కదారి పట్టాయని జిల్లా అధికారులు విచారణ జరిపి ఇద్దరు వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకున్నారు. 2018-19లో విడపనకల్లు గోడౌన్‌లో 1916 బస్తాల ఎరువులు లెక్కల్లో లేవు. 2021-22లో 2588 బస్తాల ఎరువులు లెక్కల్లో లేవు. పాల్తూరు గోడౌన్‌లో 2022-23లో 359 బస్తాల ఎరువులు కూడా అంతే. అక్రమాలు నిగ్గుతేల్చినా, పక్కదారి పట్టిన ఎరువులు, దానికి సంబంధించిన నగదును ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు. దీంతో సొసైటీలో ఎవరికి దొరికింది వారు తింటున్నారనే ఆరోపణలు ఊపందుకున్నాయి. విడపనకల్లు గోడౌన్‌లో రూ. 27.33లక్షలు, బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గోడౌన్‌లో ఒకరి నుంచి రూ.13.13లక్షలు, మరొకరి నుంచి రూ. 1.95 లక్షలు, వజ్రకరూరు మండలంలోని చాబాల గోడౌన్‌లో రూ.2.39లక్షలు రికవరీ చేయాలని కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఏ ఒక్కరికి కనీసం నోటీసు కూడా జారీ చేయలేదు.



ఆడిట్ రిపోర్టులో రూ.44.81లక్షలు రికవరీకి ఆదేశించి దృశ్యం



రూ. 17లక్షలకు కొన్నట్లు ఉన్న రిజిస్ట్రేషన్ పత్రం



రిజిస్ట్రేషన్ చేయించుకున్న మాజీ సీఈఓ రహంతుల్లా

రూ. 4లక్షలు విలువ చేయని ఇంటికి రూ. 17లక్షలు ఇచ్చినట్లు రిజిస్ట్రేషన్

విడపనకల్లు కో-ఆపరేటివ్ బ్యాంక్ సహకారంతో బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడలో గోడౌన్ నిర్వహించేందుకు 2016లో కాశంసెట్టి వెంకటలక్ష్మమ్మ ఇంటిని కొనుగోలు చేశారు. అప్పటి సీఈఓ షేక్ రహంతుల్లా పేరున అనంతపురంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. కనీసం రూ. 4లక్షలు కూడా చేయని ఆ ఇంటికి రూ. 17లక్షలు చెల్లించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇక్కడా దాదాపుగా రూ. 13లక్షలు స్వాహా చేశారు. కాశంసెట్టి వెంకటలక్ష్మమ్మను విచారించగా తనకు రూ. 4లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపింది.

పెద్ద కొట్టాపల్లి సొసైటీలో రూ.50లక్షలు పక్కదారి

మండలంలోని పెద్ద కొట్టాల పల్లి సొసైటీలోను రూ. 50లక్షలు పక్కదారి పట్టినట్లు చర్చలు జరుగుతున్నాయి. 2019-20లో అప్పటి సొసైటీ అధ్యక్షుడు వేరుశనగ, ఎరువులు విక్రయాల్లో అవినీతికి పాల్పడి మార్కుఫెడ్ కంపెనీకి దాదాపుగా రూ. 50లక్షలు బకాయి ఉన్నట్లు తెలిసింది. రైతు సేవా సహకార సంఘం పేరుతో లక్షల్లో దోచుకుతింటున్నట్లు ప్రచారం సాగుతోంది.

చెరువుల మరమ్మతుకు నిధులు ఇవ్వాలి

చర్చావేదికలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



చర్చావేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువుల మరమ్మతులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. జిల్లా సాగునీటి వనరుల పరిస్థితులపై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్రలో రైతులు వివరించిన సమస్యలపై శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో మేధావులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో కనీస వ్యవసాయం సాగు కావాలంటే 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లోనే సూచించిందన్నారు. విభజన తర్వాత అనంతపురం జిల్లాలో నికరంగా 14.85లక్షల ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224ఎకరాలు, అంటే మొత్తం సాగుభూమిలో కేవలం 3.04శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు సంవత్సరంలోపు పూర్తి చేయాలని, తుంగభద్ర డ్యామ్‌కు కొత్తగేట్లను అమర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈనెలాఖరులో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి, బడ్జెట్ ప్రతిపాదనల్లో జిల్లా సాగునీటి వనరులకోసం నిధులు కేటాయించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎం బాషా, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సత్యబోస్, భానుజా, వీకే రంగారెడ్డి, లాయర్ అబ్దుల్ రసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, గోవిందరాజులు, భోగేశ్వరరెడ్డి, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి, ఆర్వి నాయుడు, నాగమణి, చంద్రిక, రాయుడు పాల్గొన్నారు.

రేపు గుంతకల్లులో ప్రజాఫిర్యాదుల వేదిక

అనంతపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని వచ్చే సోమవారం 28న గుంతకల్లు నిర్వహిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ ఓప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజనల్(ఆర్డీఓ)ఆఫీస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆరోజు తనతో పాటు జేసీ, ఇతరశాఖల ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తామని ఆ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి, 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ వంటి అంశాల గురించి 35రోజుల పాటు బెంగళూరులో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. ఉద్యోగానికి ఎంపికైన తరువాత నెలకు రూ.15వేలకు పైగా వేతనం చెల్లిస్తారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి 'పది' ఫీజు చెల్లింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి చదివే విద్యార్థులు మార్చి/ఏప్రిల్‌లో జరిగే పరీక్షల ఫీజును ఈ నెల 28వ తేదీ నుంచి చెల్లించాలని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్, సత్యసాయి జిల్లా డీఈఓ జి.కిష్టప్ప శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ. 50 ఫైన్‌తో నవంబర్ 12 నుంచి 18వ తేదీ వరకూ, రూ. 200 ఫైన్‌తో వచ్చే నెల 19 నుంచి 25 వరకూ, రూ. 500 ఫైన్‌తో అదే నెల 26 నుంచి 30వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ. 125, ఇతరులు మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులున్న విద్యార్థులు రూ. 125, మూడుకంటే తక్కువ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు రూ. 110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతోపాటు అదనంగా రూ. 60 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ కోసం రూ. 80, తక్కువ వయస్సున్న విద్యార్థులు రూ. 300 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పనుల్లో వేగం పెంచండి

పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం

అనంతపురం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు పనుల్లో మరింత వేగం పెంచాలని ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ఎస్ఈ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీఐయూ విభాగాల అధికారులు, ఉద్యోగులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల వారిగా పనులకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీశారు. త్వరలో ఉన్నతాధికారులతో పూర్తిస్థాయి సమీక్ష ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన సమగ్ర వివరాలు, రికార్డులతో పక్కాగా ఉండాలని సూచించారు. ఎక్కడా పనులు ఆగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు కేవీకేవీ ప్రసాద్, డీఎల్ శ్రీనివాస్, పలువురు డీఈఈలు, జేఈలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుల కోసం పైరవీలు

- 31న ఆర్అండ్‌బీ ఎస్ఈ, పీఆర్ ఈఈ ఉద్యోగ విరమణ
- ఎస్ఈగా కర్నూలు నుంచి వచ్చే అవకాశం
- పీఆర్ ఈఈ కోసం జోరుగా సిఫార్సులు
- ఇప్పటికే ఉన్నతాధికారుల వద్దకు ఫైల్స్



పీఐయూ ఈఈ కేవీకేవీప్రసాద్



ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి



ఈఈ శంకరయ్య



ఈఈ చంద్రశేఖర్



పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం



ప్రస్తుత ఈఈ ప్రభాకర్‌రెడ్డి



ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్

అనంతపురం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఈఈ, రోడ్లు భవనాలు (ఆర్అండ్‌బీ) శాఖ ఎస్ఈ ఈనెల 31వ తేదీన పదవీ విరమణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్థానాలకు ఎక్కడి నుంచి ఏ అధికారో వస్తారో.. అని ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చసాగుతోంది. కొందరు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇప్పటికే తమ ఫైల్స్‌ను ఆయా శాఖల ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని పీఐయూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీకేవీ ప్రసాద్ ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నారు. చాలా మంది అధికారులు ఆయా పోస్టుల కోసం చేస్తున్న సిఫార్సులు, పైరవీలు ఓ స్థాయిలో ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

ఆర్అండ్‌బీలో ఎవరికి వారే..

ఆర్అండ్‌బీ ఎస్ఈ పోస్టు కోసం అర్హులైన అధికారులు ఎవరి స్థాయిలో వారు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న సురేష్‌బాబు, తిరుపతిలో పనిచేస్తున్న మధుసూదన్‌రావు, నెల్లూరులో పనిచేస్తున్న స్టాండ్‌లీజోన్స్‌తో పాటు కోస్తాలో ఇద్దరు ఈఈలు ఎస్ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడి ఆర్అండ్‌బీ ఎస్ఈ పోస్టుతో పాటు కడప క్వాలిటీ కంట్రోల్, చిత్తూరు ఎస్ఈ పోస్టులు కూడా ఖాళీగా ఉండటంతో ఈ ఆరుగురిలో ఏ అధికారికి ఎక్కడికి పోస్టింగ్ ఇస్తారోనని ఉత్కంఠ రేపుతోంది. అనంతపురం ఆర్అండ్‌బీ ఎస్ఈగా కర్నూలులో పనిచేస్తున్న సురేష్‌బాబుకు, చిత్తూరుకు స్టాండ్‌లీ జోన్స్, కడప క్వాలిటీ కంట్రోల్‌కు మధుసూదన్‌రావును నియమించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ పదోన్నతి ప్రక్రియ ఆలస్యమైతే ఇక్కడే ఎన్‌హెచ్ ఎస్ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించే అవకాశం కూడా లేకపోలేదు.

పీఆర్ ఈఈ కోసం సిఫార్సులు

పంచాయతీ రాజ్‌శాఖలో పీఐయూ విభాగం కీలకమైంది. ఇక్కడ రూ. కోట్లలో పనులు జరుగుతుంటాయి. ఇక్కడి ఈఈ కూడా ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్నారు. సదరు పోస్టుపై పలువురు అధికారులే ప్రజా ప్రతినిధులు, బడా కాంట్రాక్టర్ల సిఫార్సులతో పోస్టింగ్ కోసం పెద్దఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలిసింది. సదరు శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో ఆశించిన ప్రాంతాల్లో పోస్టింగ్ లభించక నిరాశ చెందిన ఇద్దరు అధికారులు కూడా ఈ పోస్టు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... ప్రస్తుతం ఫారెన్ సర్వీస్‌లో ఇతర శాఖలో పనిచేస్తున్న ఈఈ శంకరయ్య, అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేసిన చంద్రశేఖర్ ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డికానీ, ఆ శాఖ ఎస్ఈ జహీర్‌అస్లాంకు కానీ.. ఇన్‌చార్జి ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. అలా కాకపోతే.. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఈఈల్లో ఒకరిని ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా శంకరయ్య, చంద్రశేఖర్‌లలో ఒకరిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రైవేటు ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- డాక్టర్ల వివరాలు ప్రదర్శించాలి
- ఆరోగ్యవంతమైన జిల్లాగా మారుద్దాం
- వైద్యశాఖ సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖాధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ రిజిస్ట్రేషన్ కాపీతో పాటు అక్కడ పని చేస్తున్న డాక్టర్లు, వారు చదివిన సర్టిఫికెట్లు, ఎన్ని గదులు, ఎన్ని పడకలు, వాష్‌రూమ్స్ తదితర వివరాలు మొత్తం ఆవరణంలోని డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో 528 ఆసుపత్రులు ఉన్నాయని, వీటి వివరాలు పూర్తిగా తెలియజేసే విధంగా ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు కూడా సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐఎంఏ, ఆప్నా, ప్రైవేట్ ఆసుపత్రుల అసోషియేషన్లు జిల్లాలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని మహిళలు, చిన్నపిల్లలకు అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ డాక్టర్లు సమష్టిగా పని చేసి అనంతను ఆరోగ్యవంతమైన జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఐఎంఏ అధ్యక్షుడు మురళీక్రిష్ణ, ఆప్నా అధ్యక్షుడు విజయకుమార్, థామస్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఆర్టీటీ హెల్త్ డైరెక్టర్ రవిప్రసాద్‌రావు, డెమోలు త్యాగరాజు, గంగాధర్, పలువురు వైద్యాధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయండి

ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయాలని అటవీ శాఖ సిబ్బందిని ఇన్‌చార్జి డీఎఫ్ఓ ఆనంద్ ఆదేశించారు. అటవీశాఖ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నదానిపై శనివారం అటవీశాఖ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీశాఖకు నిధుల కేటాయించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీల అభివృద్ధికి ఎలాంటి మొక్కలు అందుబాటులో ఉంచాలి? ఎలాంటి ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి? వన్యప్రాణుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్లు నారపరెడ్డి, ప్రవీణ్‌కుమార్, అక్బర్ పాల్గొన్నారు.

పింఛన్ పత్రాలకు

ప్రత్యేక కౌంటర్లు

- మంగళ, శుక్రవారాల్లోనే వైద్య పరీక్షలు
- సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు



హెచ్ఓడీలతో సమీక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పత్రాల కోసం వచ్చే వారికి జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వైద్యాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పరీక్షల కోసం ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వస్తుండడంతో ఎలాంటి చర్యలు తీసుకుందామని ఆర్ఎంఓలు, హెచ్ఓడీలతో చర్చించారు. ఈ తాకిడిని నిలువరించడం కోసం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మంగళ, శుక్రవారాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో ముందుగా తెలిపిన మేరకు పేషెంట్లు రావచ్చని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకుంటామన్నారు. 2 గంటల నుంచి 4 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న పేషెంట్లకు సంబంధిత డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆసుపత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ సెంటర్, బర్న్‌వార్డు, సాధారణ ఓపీ కేంద్రాలలో కౌంటర్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఓ హేమలత, హెచ్ఓడీలు బీమ సేనాచారి, భాస్కర్, ఆత్మారామ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌కుమార్



అనంతపురం నగరంలోని బ్రాహ్మణ వీధికి చెందిన గంగాధర్ కుమారుడు. చిన్నప్పటి నుంచి ఇస్కాన్ ఆలయానికి వెళ్లేవాడు. స్వామి సేవలో తరించేవాడు. నాలుగేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల కుమార్తె ఉంది. గంగాధర్‌కు ముగ్గురు సంతానం కాగా.. సంతోష్ ఒక్కడే కుమారుడు. చిన్నప్పటి నుంచి స్వామి సేవ చేస్తున్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

వెంకటేశ్



అనంతపురం కమలా నగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు. ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. పన్నెండేళ్లుగా ఇస్కాన్ నిర్వహించే సంకీర్తనల్లో పాల్గొంటున్నాడు.

లక్ష్మీప్రసన్నకుమార్ రెడ్డి



అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమారుడు. బీటెక్ పూర్తి చేశాడు. 15 సంవత్సరాలుగా ఇస్కాన్ ఆలయంలో స్వామి వారికి సేవ చేస్తున్నాడు. ప్రమాదానికి గురైన కారును తానే నడిపాడు.

కర్ణ ప్రణీత్ ప్రణవ సాయిరెడ్డి



అనంతపురం పాతూరులోని భాగ్యనగర్ చెందిన పెద్దారెడ్డి, చంద్రలేఖ దంపతుల కుమారుడు. హైదరాబాద్‌లోని స్వామి నారాయణ ఆలయం అనుబంధ విద్యా సంస్థలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులు సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు ఇస్కాన్ భక్తులు కావడంతో ఇతర భక్తులతోపాటు తన కుమారుడిని తాడిపత్రిలో జరిగిన సంకీర్తన కార్యక్రమానికి పంపారు.

శ్రీనివాసులు



శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్‌చెరువు గ్రామానికి చెందిన అయ్యప్ప, కొండమ్మ దంపతుల ఏకైక కుమారుడు. డిగ్రీ వరకు చదివాడు. ఆరేళ్ల క్రితం దివ్య అనే మహిళతో వివాహమైంది. వీరికి ఐదు సంవత్సరాల కుమారుడు కృష్ణ ఉన్నాడు. శ్రీనివాసులు, ఆయన భార్య దివ్య, కుమారుడితో కలిసి అనంతపురం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు.కలెక్టరేట్ సమీపంలోని ఇస్కాన్ గోశాల ఆవరణలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నాడు. 14 సంవత్సరాలుగా ఇస్కాన్‌లో సేవలు అందిస్తున్నాడు. సీఎం చంద్రబాబునాయుడు 2014 ఎన్నికలకు ముందు 'వస్తున్నా మీ కోసం' పాదయాత్రలో భాగంగా ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఆలయంలో పూజారిగా ఉన్న శ్రీనివాసులు.. ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి హారతిని చంద్రబాబుకు అందించారు.

షణ్ముగ్



శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహాడపల్లికి చెందిన సాంబమూర్తి, సుజాత దంపతుల కుమారుడు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూనే.. కియ కార్ల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అనంతపురం సాయినగర్‌లో ఉంటున్నాడు. మూడేళ్లుగా ఇస్కాన్ ఆలయ భక్త బృందంలో సభ్యుడిగా ఉంటూ సంకీర్తనలలో పాల్గొంటున్నాడు.

నా స్వామి రాత్రికి వస్తాడు..



రోడ్డు ప్రమాదం శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) మృతి చెందడంతో ఆయన భార్య దివ్య ప్రమాద స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి కుప్పకూలిపోయారు. 'అన్నా.. నా స్వామి రాత్రికి వస్తాడు. చనిపోలేదు. ఎక్కడికీ పోలేదు' అని దివ్య రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. 'రాత్రికల్లా ఇంటికి వస్తానని ఫోన్ చేశాడు.. ఇప్పుడు ఇలా అయిపోయాడు..' అని తన బంధువులతో చెప్పుకుంటూ విలపించారు. ఆమెను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

సార్.. నా బిడ్డ కళ్లను దానం చేయండి

ప్రమాద స్థలానికి చేరుకున్న ప్రణవ్ సాయిరెడ్డి తల్లి చంద్రలేఖ కన్నీరుమున్నీరయ్యారు. 'మా కుటుంబం అంతా స్వామి భక్తిలోనే ఉన్నాం. ఆ భక్తితోనే నా బిడ్డను సంకీర్తనకు పంపాము. ఇప్పుడు నా బిడ్డ లోకం వదిలి వెళ్లిపోయాడు..' అని ఆమె బోరున విలపించారు. 'నా బిడ్డకు అప్పుడే నూరేళ్లునిండిపోయాయి సార్.. నా బిడ్డను వెంటనే ఆసుపత్రి తీసుకువెళ్లండి. నా బిడ్డ కళ్లను దానం చేయండి' అని అక్కడున్న పోలీసులను వేడుకుంది. ఆమె వేదనను చూసిన పోలీసులు, అక్కడి ప్రజలు చలించిపోయారు.



పెళ్లికి వెళ్లుంటే బతికేవాడివేమో..

'బంధువుల పెళ్లికి పోమ్మంటే స్వామి పూజకు వెళ్లి పరలోకానికి పోతివా నాన్నా..' అంటూ లక్ష్మీప్రసన్న కుమార్ రెడ్డి తల్లిదండ్రులు శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి గుండెలు బాదుకున్నారు. పెళ్లికి పోయుంటే బతికేవాడివేమో కదా నాన్నా.. అని తమ ముద్దుల కొడుకు మృతదేహం వద్ద విలపించారు. తెల్లవారుజామునే బయటకొచ్చి.. ఇలా మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా.. అంటూ గుండెలు బాదుకున్నారు.

రోడ్డు ప్రమాదంపై ఎంపీ బీకే దిగ్భ్రాంతి

పెనుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఇస్కాన్‌కు చెందిన ఆరుగురు మృతిచెందడం బాధాకరమని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఓ ప్రకటనలో తెలిపారు. దైవ సంకీర్తనకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరగడం చాలా బాధాకరమన్నారు. మృతుల బంధువులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అత్యంత బాధాకరం: సవిత

రోడ్డు ప్రమాదంలో ఇస్కాన్ సేవకుల మృతి అత్యంత బాధాకరమని మంత్రి సవిత విచారం వ్యక్తం చేశారు. ఆరుగురి మృతి దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఆమె అన్నారు.





మృతులను చూసి విలపిస్తున్న బంధువులు

పరంధామా..



ఇంత ఘోరమా..!

- గుండె పగిలిన శ్రీకృష్ణ భక్తులు
- ఆరుగురిని మింగిన ప్రమాదం
- నాయనపల్లి క్రాస్ వద్ద ఘోరం
- టైరు పేలి.. లారీని ఢీకొన్న కారు

శింగనమల/ అనంతపురం కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నాయనపల్లి క్రాస్‌లో జరిగిన ప్రమాదాన్ని కళ్లారా చూసిన స్థానికులు తీవ్ర ఆవేదన చెందారు. 'కారు టైర్ బరెస్ట్ కావడంతో ఎదురుగా వస్తున్న లారీని ఒక్కసారిగా కారు ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జుగా మారింది. దాదాపు 20 మీటర్ల దూరం కారును లారీ లాక్కువెళ్లింది. దీంతో కారులో ఉన్న ఏ ఒక్కరూ ప్రాణాలతో మిగలేదు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. లారీని కారు ఢీకొట్టిన సమయంలో హఠాత్తుగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. క్షణాల్లో తేరుకుని పరుగులన అక్కడికి చేరుకున్నారు. కారులోని వారిని బయటకు లాగే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కారులో లారీ నుంచి వేరుగా లాగారు. మృతదేహాలను బయటకు తీసేందుకు గంట సమయం పట్టింది. కారు డ్రైవర్ లక్ష్మీప్రసన్నకుమార్‌రెడ్డి మృతదేహాన్ని బయటకు తీసేందుకు చాలా కష్టపడ్డారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఐజీ

నాయనపల్లి క్రాస్‌లో ప్రమాద స్థలాన్ని డీఐజీ షిమోషి, అడిషినల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ వెంకటేశులు పరిశీలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.







ఆసుపత్రి వద్ద మిన్నంటిన రోదనలు



ఆసుపత్రిలో మృతులను చూసి విలపిస్తున్న దృశ్యం





ఆసుపత్రి వద్ద గుమిగూడిన మృతుల బంధువులు

కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి మృతి

గుత్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో కర్ణాటక బస్సు ఢీకొని శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. బస్సు గుత్తి నుంచి బెంగళూరుకు బయల్దేరింది. అనంతపురం రోడ్డులోని మాతృశ్రీ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వయస్సు 55 సంవత్సరాలు ఉండవచ్చునని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహంపై నీలం కలర్ ఫుల్ డ్రాయర్ మాత్రమే ఉందన్నారు. మృతుడు పట్టణంలో భిక్షాటన చేస్తూ ఉండేవాడన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు



అరెస్టయిన వారిని చూపుతున్న సీఐ

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం గంజాయిను సేవిస్తున్న అజయ్, దీపక్, నాగేంద్రతో పాటు విక్రేత మహమ్మద్‌షరీఫ్‌ను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి 243గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన మహమ్మద్‌షరీఫ్ బళ్లారి నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించేవాడన్నారు. దీంతో ఫ్లైఓవర్ వద్ద గంజాయిని విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో దాడులు చేసి నలుగురిని అరెస్టు చేశామన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

అధిక మోతాదులో మందులు తీసుకుని యువకుడి మృతి



శాంతరాజ్ (ఫైల్)

కుందుర్పి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్యులు సూచించిన మందుల కన్నా అధికంగా వాడి శాంతరాజ్ (35) అనే యువకుడు శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శాంతరాజ్ గుండె సంబంధిత వ్యాధితో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం ఇంటికి చేరాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బెంగళూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. పరీక్షించిన అనంతరం వైద్యులు మందులు ఇచ్చారు. వాటిని తీసుకోవాల్సిన మేరకు కాకుండా అధికంగా తీసుకోవడంతో వారం రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కుందుర్పి పోలీస్ స్టేషన్లో మృతుడి అన్న అనిల్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు చేయడం పట్టణంలో కలకలం రేపుతోంది. పట్టణంలోని కురాకులతోటకు వెళ్లే దారిలోని పొలంలో క్షుద్రపూజలు చేసి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. శనివారం యర్రిస్వామి అనే రైతు పొలం పరిశీలించడానికి వెళ్లిన సందర్భంలో దాదాపు ఆరడుగుల లోతు తవ్వి చుట్టూ పూజలు చేసిన దృశ్యం చూసి అవాక్కయ్యారు. పెద్ద బండలను సైతం తొలగించినట్లు ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వెంటనే పొలం యజమాని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి ఉపాధ్యాయుడి మృతి



గోవిందరాజులు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి గోవిందరాజులు (50) అనే ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాసరి గోవిందరాజులు అనే ఉపాధ్యాయుడు ఇంటి నుంచి శుక్రవారం శివాలయం దగ్గర ధ్యానం చేయడానికి వెళుతున్నానని చెప్పి వెళ్లారు. రాత్రి వరకు గోవిందరాజులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించగా బావిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య వెంకటరమణమ్మ, కుమారుడు వినయ్‌కుమార్, కుమార్తె జయకీర్తన వున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌బాక్స్

రైతు సేవా సిబ్బంది క్రమబద్ధీకరణకు శ్రీకారం

అనంతపురం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రం సిబ్బందితో పాటు ఎంపీఈఓలు, ఏఈఓలను క్రమబద్ధీకరణ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 29వతేదీ వీటికి సంబంధించి పూర్తి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు క్రమబద్ధీకరణలోనే తిరిగి జిల్లాలో పోస్టింగులు ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పత్తి రైతులు నమోదు చేసుకోండి

అనంతపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 1 తరువాత పత్తి కొనుగోలు చేస్తామని, రైతులు పంట నమోదు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7121 నుంచి రూ.7521 తో కొనుగోలు చేస్తామన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నవంబరు 1 తరువాత శాంపిల్స్‌ను గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో కాటన్ కార్పొరేషన్ వారికి చూపించి మద్దతు ధరకు అమ్ముకోవచ్చన్నారు. 8 నుంచి 12 శాతం వరకు మాత్రమే తేమ ఉండాలన్నారు. తడిచిన, రంగు మారిన పత్తిని తీసుకురాకూడదన్నారు.

పోటా పోటీగా ఫుట్‌బాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ -14 బాల, బాలికల ఫుట్‌బాల్ క్రీడలు శనివారం రెండో రోజు పోటాపోటీగా సాగాయి. బాలుర విభాగంలో అనంతపురం, విశాఖ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం ఉదయం జరిగే పోటీలో గెలిచినవారు ఫైనల్‌కు వెళ్తారు. మరో పూల్‌లో శ్రీకాకుళం జట్టు ఫైనల్‌కు చేరుకుంది. బాలికల విభాగం సెమీస్‌లో చిత్తూరు జట్టుపై గెలిచిన అనంతపురం ఫైనల్‌కు చేరుకుంది. మరో పూల్‌లో ఆదివారం ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి తలపడనున్నాయి. గెలుపొందిన వారు ఫైనల్‌కు చేరుకుంటారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి, 15 మందికి తీవ్ర గాయాలు
- వేములపాడు హైవేపై సంఘటన
- బాధితులంతా కొట్టాలపల్లికి చెందిన కూలీలే



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

యాడికి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేములపాడు వద్ద జాతీయ రహదారిపై శనివారం కారు- ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఆటో డ్రైవర్ సహా 15మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు కొట్టాలపల్లి గ్రామానికి చెందిన 15మంది కూలీలు తమ గ్రామానికే చెందిన ఆటోను బాడుగకు తీసుకొని తాడిపత్రి మండలంలోని బందార్లపల్లి గ్రామంలో వేరుశనగ పంట కోత పనికి వెళ్లారు. పని ముగిసిన తర్వాత సొంతూరికి ఆటోలో బయలుదేరారు. వేములపాడు గ్రామ సమీపం వద్దకు రాగానే గుంతకల్లు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఎదురుగా వచ్చి వేగంగా ఢీకొంది. దీంతో కూలీలు ఆటోలో నుంచి ఎగిరి కిందపడ్డారు. ఆటోడ్రైవర్ శివతోపాటు 15మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో చిన్నరంగారెడ్డి, నబీరసూల్, ప్రతాప్, కుళ్లాయప్ప, కుళ్లాయమ్మ, కాశీంబీ, దస్తగిరమ్మ, ప్రతాప్, సుబ్బమ్మ, రమణమ్మ, రంగమ్మ, రామచంద్రుడు, లక్ష్మి, కళావతి మరో ఇద్దరు ఉన్నారు. బాధితులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దస్తగిరమ్మ (50)ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈమెకు భర్త షెక్షావలి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కొట్టాలపల్లి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి తరలివచ్చారు. పోలీసులు సంఘటనా ప్రదేశానికి వచ్చి ప్రమాదంపై వివరాలు ఆరాతీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. కాగా రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వారిని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు.



దస్తగిరమ్మ(ఫైల్)

పోస్టుమ్యాన్ ఆత్మహత్య



ఆంజనేయులు నాయక్

సోమందేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగినాయనిచెరువు తండాకు చెందిన పోస్టుమ్యాన్ అంజనేయులునాయక్ (48)ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. ఎస్ఐ రమేష్ తెలిపిన మేరకు ఆంజనేయులునాయక్ సోమందేపల్లి గాంధీనగర్‌లో నివాసముంటున్నాడు. భార్య సాకీబాయ్ నర్సుగా పని చేస్తున్నారు. సుద్దకుంటపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు నాయక్ విధులకు వెళ్లున్నట్లు భార్యకు చెప్పి శుక్రవారం బయటకు వచ్చాడు. ఆ సమయంలో సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేశాడు. నక్కలగుట్ట సమీపంలో ఓ వ్యక్తి స్పృహకోల్పోయి పడి ఉన్నాడన్న స్థానికుల సమాచారంతో ఎస్ఐ తన బృందంతో అక్కడికి చేరుకున్నారు. పరిసరాలను గమనించిన ఎస్ఐ పంట పొలాలకు వాడే క్రిమిసంహారకమందును తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందజేయడంతో వారు ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. భార్య సాకీబాయి మాట్లాడుతూ శుక్రవారం విధులకు వెళ్లిన భర్త ఆంజనేయులు రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలిసి గాలించామని తెలిపింది. ఆచూకి తెలియలేదన్నారు. శనివారం నక్కలగుట్ట వద్ద శవమై కనిపించాడని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇంజనీరింగ్ చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు.

రోడ్డు నాణ్యంగా ఉండాలి

● క్యూసీ ఈఈ మల్లికార్జున మూర్తి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ మల్లికార్జునమూర్తి అధికారులు

అనంతపురం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో చేస్తున్న రోడ్ల నాణ్యత పక్కాగా ఉండాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) ఈఈ మల్లికార్జునమూర్తి పేర్కొన్నారు. శనివారం ఆయన డీఈఈ లోకన్నతో కలిసి అనంతపురం సబ్ డివిజన్-1 పరిధిలోని అనంతపురం రూరల్ మండలంలోని పాపంపేటలో రూ.7 లక్షలతో చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. సదరు రోడ్డు నాణ్యతను పరిశీలించి డీఈఈ లక్ష్మీనారాయణకు తగిన సలహాలు సూచనలు ఇచ్చారు.

పరిశోధనాత్మకంగా ముందుకు వెళ్లాలి



శంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల బృందం

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు పరిశోధనాత్మకంగా ముందుకు వెళ్లాలని కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పీవీకేకేఐటీలో స్వాగతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, రూరల్ సీఐ శేఖర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ స్నేహ భావంతో మెలగాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, డీన్ సంతోష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోవర్ధన, ఏఓ మనోహర్‌రెడ్డి, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతులు లక్ష్మీనరసప్ప, కిరణ్‌కుమార్‌రావు, అధ్యాపకులు ఆనంద్, వహీదా పర్వీన్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితోనే సాధికారత: పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వాలంబన, సాధికారత సాధ్యమని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు స్వయం ఉపాధి ఉత్పత్తులు, ఆన్‌లైన్ వ్యాపారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకుని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మహిళల్లో జీవనోపాధుల పెంపునకు ప్రత్యేక దృష్టి సారించమన్నారు. వీటితో పాటు ఎస్టీ సంఘాల మహిళలకు కోళ్ల పెంపకానికి ప్రభుత్వం రూ.3600సబ్సిడీతో రూ.6వేల విలువ చేసే యూనిట్లు అందజేస్తోందని తెలిపారు. అనంతరం పలువురు అధికారులు ఆయా పథకాలపై అవగాహన కల్పించారు. డీపీఎంలు గంగాధర్, రాధారాణి, సత్యనారాయణ, రవీంద్రబాబు, ఏపీఎంలు రియాజ్, అనిత, మంజుళ, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

జిల్లా యువకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న మహేంద్ర

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరదల్లో చిక్కుకుపోయిన బాధితులను ఆదుకోవడంలో విశేష కృషి చేసిన జిల్లాకు చెందిన ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహాయ కార్యదర్శి మహేంద్రకు అరుదైన గుర్తింపు లభించింది. వరద బాధితులకు సహాయంలో సేవలందించిన వారికి విజయవాడలో ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన బుడమేరు వారియర్స్ అవార్డు-2024 మహేంద్ర అందుకున్నాడు. నిరాశ్రయులైన వరద బాధితులకు సేవలందిస్తూ అందరిలో స్ఫూర్తి కలిగించిన మహేంద్రకు అవార్డు రావడం పట్ల ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర రమేష్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహన్‌కృష్ణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, మాస్టర్‌మైండ్స్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ బసవయ్య ప్రత్యేకంగా అభినందించారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

అనంతపురం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగర శివారులో నివాసముంటున్న సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. మానస(32)కూడేరు మండలం ఉదిరిపికొండ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈమె భర్త మల్లికార్జునతో కలిసి సిండికేట్‌నగర్‌లో నివాసముంటున్నారు. మల్లికార్జున కూడా సచివాలయం ఉద్యోగి అని తెలిసింది. ఏమైందో తెలియదు కానీ మానస శనివారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. కారణాలు తెలియరాలేదు.

తెలుగు తమ్ముళ్ల గొడవ.. కేసు నమోదు

అనంతపురం నగరంలోని 44వ డివిజన్ పరిధిలోని నడిమివంక సమీపంలో తెలుగుదేశం పార్టీలోని ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ విషయంలో కేసు నమోదు చేసినట్లు ఫోర్‌టౌన్ సీఐ సాయినాథ్ తెలిపారు. గురువారం రాత్రి గొడవ చోటుచేసుకుంది. కార్పొరేటర్ భర్త మధురాయల్, అతని అనుచరులు, తిరుపాల్‌యాదవ్‌తో పాటు మరికొందరి మధ్య ఘర్షణ చేసుకుంది. బాధితుడు తిరుపాల్ ఫిర్యాదు మేరకు మధురాయల్, రాజేష్, జోగి రాజేంద్ర, మున్నానగర్ రమేష్, సలీంలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం నగర శివారులో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు బీటర్లను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. రుద్రంపేట పరిధిలో మట్కా నిర్వహిస్తుండగా వేణుగోపాల్, కాట్నేకాలువకు చెందిన మల్లికార్జునను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.50200లు స్వాధీనం చేసుకున్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం కోర్టు ఆవరణంలోని జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పోలీస్ అధికారులతో స్టాండింగ్ కమిటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా కాంపౌండ్, క్రిమినల్, సివిల్ కేసుల విషయంలో కక్షిదారుల్లో అవగాహన పెంచాలన్నారు.

సీఎంఓ కార్యాలయం ఆరా..

శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసింది. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి ఘటనపై వివరాలు సేకరించారు. మృతుల కుటుంబాలు, వారి జీవనస్థితిగతుల వివరాలను వెంటనే పంపాలని ఆదేశాలందాయి.

పార్టీ ఉంటేనే.. మనం ఉన్నాం..

● సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఉంటేనే మనం ఉన్నామని,నేను ఎమ్మెల్యేగా గెలిచినా, మీకు గ్రామాల్లో నాయకులుగా గుర్తింపు ఉన్నా, అది పార్టీ వల్లనేనని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజనప్ప, నియోజకవర్గ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముఖ్యనాయకులు హాజరయ్యారు. ముఖ్యనాయకులతోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, పార్టీ జిల్లా అధ్యక్షులు అంజనప్ప సభ్యత్వ రెన్యువల్ చేసుకున్నారు. ఎమ్మెల్యే మట్లాడుతూ ఈఏడాది 80వేలు మంది సభ్యత్వ నమోదు తీసుకునేలా చూడాలన్నారు. 2022-24సంవత్సరంలో సభ్యత్వం తీసుకొని మరణించిన 10మందికి ఒక్కొక్కరికి రూ.2లక్షలు చొప్పున వారి కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్‌కి జమ చేశామని చూపుతూ సభ్యత్వ కార్డుల సమస్య కూడా లేకుండా చర్యలు తీసుకుంటామని అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.



సభ్యత్వం రెన్యువల్ పత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మైనార్టీ వార్డెన్లకు వేతన వెతలు

● 19 నెలలుగా అందని జీతాలు

● గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణం

● హెడ్‌ఆఫ్ అకౌంట్ రద్దుతో తలెత్తిన సమస్య

● కూటమి ప్రభుత్వం అకౌంట్ ఏర్పాటు



మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల వార్డెన్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సకాలంలో డైట్ బిల్లులు అందక అప్పులు చేసి మరీ విద్యార్థులకు మెనూను అమలు చేస్తున్నారు. మరోవైపు నెలనెలా అందాల్సిన వేతనాలు అందకపోవడంతో పలువురు వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు జిల్లాలోని మైనార్టీ సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు పడుతున్న ఇబ్బందులే తార్కాణంగా నిలుస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 19 నెలల వేతనాలు వారికి అందలేదంటే వారి పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వందల మంది వార్డెన్లకు ఇదే సమస్య ఉందా అంటే..కేవలం ఇద్దరు వార్డెన్లదే ఈ సమస్య. ఇందుకు కారణం అప్పటి వైసీపీ ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణమనే చెప్పాలి. ఫలితంగా ఆ వార్డెన్లు గత 19 నెలలుగా జీతాలందక... బయటి వ్యక్తుల నుంచి వడ్డీలకు అప్పులు తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఇదే విషయంపై గతంలో అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది.

హెడ్‌ఆఫ్ అకౌంట్ రద్దుతో తలెత్తిన సమస్య

మైనార్టీ సంక్షేమశాఖ వార్డెన్లకు రాష్ట్రస్థాయిలో హెడ్ ఆఫ్ అకౌంట్ కింద వేతనాలు అందించేవారు. 2023లో ఆ అకౌంట్ వార్డెన్ల కింద బిల్లులు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారులు నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయం వల్ల అసలు వార్డెన్లే లేరన్న సమాచారాన్ని ఆ అకౌంట్‌లో నమోదు చేసినట్లు తెలిసింది. దీంతో అప్పటిప్రభుత్వం వెనకాముందు చూడకుండా అసలు ఎవరూ లేవ్వుడు ఆ అకౌంట్ ఎందుకని రద్దు చేసేశారు. దీంతో ఆ వార్డెన్లు దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు. ఈ విషయంపై డైరెక్టరేట్‌కు ఆ వార్డెన్లు పలుమార్లు తిరిగి... మాకు జీతాలివ్వాలని తిరిగి అకౌంట్‌ను పునరుద్ధరించాలని విన్నవించినా అప్పటి అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఉద్యోగాలు వదులుకోలేక 19 నెలలుగా గడ్డుకాలాన్ని ఎదుర్కొంటూ వస్తున్నారు.

పూర్తిస్థాయా..? అరకొరా...?

వైసీపీ ప్రభుత్వంలో అకౌంట్ రద్దు చేయడంతో దిక్కుతోచని స్థితిలో పడిన ఆ వార్డెన్లకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఆ శాఖకు కొత్తగా వచ్చిన ఏడీస్థాయి అధికారి రాష్ట్రస్థాయి అధికారులకు సమస్యను వివరించారు. దీనికి తోడు ఆ వార్డెన్లు మరోమారు రాష్ట్రస్థాయి అధికారులను కలిసి సమస్యను వివరించగా.. ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇందుకు ప్రభుత్వం స్పందించి అకౌంట్‌ను తిరిగి పునరుద్ధరించింది. దీంతో ఆ శాఖ ఏడీ 19 నెలలకు సంబంధించిన వార్డెన్ల వేతనాల బిల్లులు డైరెక్టరేట్‌కు పంపారు. ఇక్కడే ఓ సమస్య వార్డెన్ల నుంచి ఉత్పన్నమవుతోంది. 19 నెలల వేతనాలు చెల్లిస్తారా..? లేక అరకొర వేతనాలు అందించి మమా అనిపిస్తారన్న సందేహాలను వారిని తొలుస్తున్నాయి.

బిల్లులు పంపాం..



వార్డెన్లకు సంబంధించి 19 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. గతంలో డైరెక్టరేట్ స్థాయిలో అకౌంట్ రద్దు కావడంతోనే సమస్య తలెత్తింది. ప్రస్తుతం అకౌంట్‌ను పునరుద్ధరించింది. వారి వేతనాల బిల్లులు పంపాం. తొందర్లోనే వారి ఖాతాలకు వేతనాలు జమవుతాయి.

-రామసుబ్బారెడ్డి, ఏడీ, మైనార్టీ సంక్షేమశాఖ

ఇన్‌చార్జి హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాపోటీల్లో పాల్గొనే అవకాశం ఖాదర్‌పేట హైస్కూల్ బాలిక కోల్పోవడానికి ఆ స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వైఖరే కారణమని, హెచ్‌ఎంపై చర్య తీసుకోవాలని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు ఒక డిమాండ్ చేశారు. కె. కీర్తి అనే విద్యార్థిని ఖాదర్‌పేట హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 26 నుంచి 28వ తేదీ వరకు జరగబోయే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉందని తెలిపారు. ఇందుకు విద్యార్థిని తల్లిదండ్రులు అంగీకరించారన్నారు. అయితే స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అనుమతి ఇవ్వలేదన్నారు. ఇలాంటి టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకటన ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షులు కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఇతర నేతలు ఉన్నారు.

వ్యూహాత్మక లక్ష్యాలు అమలు చేయాలి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాణిజ్య రంగాల్లో రాణించాలంటే అప్పటికప్పుడు అవసరమైన వ్యూహాత్మక లక్ష్యాలు అమలు చేయాల్సి ఉంటుందని ఎస్కేయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్, మాజీ రిజిస్ట్రార్ ఏవీ రమణ అన్నారు. శనివారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్-2024 ఫెస్ట్‌ను నిర్వహించారు. ముఖ్యవక్తలుగా రమణతోపాటు సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాలతీ హాజరయ్యారు. అనంతరం ఏవీ రమణను కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డిని సన్మానించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఇన్‌చార్జి డీఐజీకి చెక్కును అందజేస్తున్న రిజిస్ట్రార్ శాఖ ఉద్యోగులు

అనంతపురం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న సబ్ రిజిస్ట్రార్ కుటుంబానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సంఘం, ఉద్యోగులు కలిసి ఆర్థిక సాయం అందించారు. శనివారం ఆ శాఖ డీఐజీ విజయలక్ష్మి చేతులమీదుగా రూ.3లక్షల చెక్కును అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శీనానాయక్ ఆత్మహత్య చేసుకున్నారు. ఆ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షామీర్‌బాషా నేతృత్వంలో ఉద్యోగులు తమ వంతు సాయం చేశారు. శనివారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ విజయలక్ష్మి, డీఆర్ భార్గవ్, యూనియన్ అధ్యక్షుడు షామీర్ చేతుల మీదుగా శీనా నాయక్ భార్య సుజాతబాయికి రూ.3లక్షల చెక్కు అందజేశారు.

'పేదల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలి'



గొర్రెల పెంపక క్షేత్రాన్ని పరిశీలిస్తున్న సంచాలకులు హేమలత

బుక్కరాయసముద్రం, అక్టోబరు 26: ఉమ్మడి జిల్లాలో పాడి, గొర్రెలు, కోళ్ల పెంపకంతో పేదల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే విధంగా పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత శాస్త్రవేత్తలపై ఉందని తిరుపతి శ్రీవెంకటేశ్వర పశుపరిశోధన కేంద్రం సంచాలకులు హేమలత సూచించారు. శనివారం మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలోని పశుపరిశోధన కేంద్రంలో క్లినికో పాతాలజీ, సైటాలజీ లాబ్ రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ ల్యాబ్ ద్వారా జీవాలలో వచ్చే వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. అనంతరం కేంద్రంలో గొర్రెలు, కోళ్ల పెంపకం ఎలా చేపడుతున్నారని పరిశీలించారు. డాక్టర్ హెచ్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సైంటిస్టులు చేతన్‌కుమార్, రఘుకరణ్ పాల్గొన్నారు.

'పల్లె పండుగ' పనులన్నీ ప్రారంభించాలి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలు పనులన్నీ వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీంబాషా సూచించారు. శనివారం డ్వామా పీడీ పలు మండలాల్లోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం, పెద్దవడుగూరు మండలం కొండపల్లి గ్రామం నుంచి భీమునిపల్లి క్రాస్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు, పామిడి మండలం పొగరూరు గ్రామ పంచాయతీ నుంచి జాతీయ రహదారి వరకు, తంబాలపల్లి ఎస్సీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఏపీడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి: సీపీఐ

అనంతపురం విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. జాఫర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కేశవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు భారీగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే హామీలను అమలుచేయలన్నారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



గార్లదిన్నెలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కలుగుతుందని శింగనమల నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. శనివారం గార్లదిన్నెలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నాయకులు నవీన్, పాండు, గుత్తాబాలకృష్ణ, పుల్లన్న, నరసింహారెడ్డి, సుంకన్న, రామచంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

నార్పల: తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా అని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నియోజకవర్గ అబ్జర్వర్ గురప్పనాయుడు, బండారు లీలావతి అన్నారు. గూగూడు గ్రామంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు ప్రజల్లో అవగాహన కల్పించాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సూచించారు. శనివారం మండలంలోని గరిమేకలపల్లి గ్రామంలో సభ్యత్వనమో దు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు,సుధాకర్, మారుతిప్రసాద్, శ్రీధర్‌నాయుడు, సుబ్బరాయుడు, ముత్యాలు, శేషు పాల్గొన్నారు.

కనగానపల్లి: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా రూ.5లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి పేర్కొన్నారు. వేపకుంట గ్రామంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ యాతం పోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, ప్రభాకర్‌నాయుడు, బిల్లేదాము పాల్గొన్నారు.

శింగనమల: నియోజకవర్గం కేంద్రం శింగనమల ఆత్మారామస్వామి దేవాలయంలో టీడీపీ సభ్యత నమోదును శనివారం ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. టీడీపీ నాయకులు వెంకటేశ్, బోయసత్తి, మాసూల చంద్రమోహన్, మాజీ జడ్పీటీసీ షాలిని, ఆది, రాజశేఖర్‌యాదవ్, చితంబరి, నరసింహులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సిద్దరాంపురం గ్రామంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే తల్లి బండారు లీలావతి, పసుపుల శ్రీరామిరెడ్డి, పసుపుల హనుమంతురెడ్డి పాల్గొని మాట్లాడారు. టీడీపీ నాయకులు బండారు సాయి, పొడరాళ్ల రవీంద్రా, మల్లికార్జునరెడ్డి, ఓబులపతి, పెద్దప్ప, రమేష్, ఆదినారాయణ, పాల్గొన్నారు.



నార్పలలో ఆలం నరసానాయుడు..



రామగిరిలో ఎల్. నారాయణచౌదరి..

లక్ష మందితో సభ్యత్వం: ఎమ్మెల్యే



సభ్యత్వం చేయిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్‌లో లక్ష మందితో పార్టీ సభ్యత్వం చేయిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం 35వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ రాజారావు, 29వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పలువురికి పార్టీ సభ్యత్వం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని తీసుకున్నారని, 10 రోజుల క్రితమే ఇక్కడ సభ్యత్వ నమోదు మొదలైందన్నారు. ఇప్పటి దాకా 10వేల మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. నెల రోజుల్లో లక్షల మందితో సభ్యత్వం పూర్తి చేసేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, రాయల్ మురళీ, సుధాకర్‌నాయుడు, కృష్ణకుమార్, ఫిరోజ్ అహ్మద్, నెట్టెం బాలకృష్ణ, కాకర్ల ఆదినారాయణ, సరిపూటి శ్రీకాంత్, కడియాల కొండన్న పాల్గొన్నారు.

వ్యాయామ అధ్యాపకుల పోస్టుల భర్తీకి కృషి



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న వ్యాయామ విద్య అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యేల దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఎస్కేయూ అంతర కళాశాలల క్రీడాపోటీలు-2024 ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన గ్రూప్-ఏ టోర్నమెంట్‌ను ఎస్కేయూ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రెటరీ జెస్సీ, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీరాములు నాయక్, వ్యాయామవిద్య అధ్యాపకులు శ్రీరాములు, అధ్యాపకులు రంగనాథ్, కేశాలు, చలపతి. బాలాజీనాయక్, తిరుమలేష్, సుగప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మేయర్ స్వరూప జన్మదినం



మాజీ మేయర్ స్వరూపకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్ స్వరూప జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక స్వరూప నివాసంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆమెకు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, టీడీపీ నాయకుల సమక్షంలో స్వరూప కేక్ కట్ చేశారు. మాజీ మేయర్ భర్త వెంకటేష్, నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, సరిపూటి రమణ, కృష్ణకుమార్, నారాయణస్వామి యాదవ్, సుధాకర్ నాయుడు, విశాలాక్షి, విజయశ్రీరెడ్డి, వసుంధర పాల్గొన్నారు.

ఉత్తమ సౌందర్య నిపుణులుగా లక్ష్మీసరితారెడ్డి



హీరో విశాల్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మీసరితా రెడ్డి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సౌందర్య నిపుణురాలిగా అనంతపురానికి చెందిన లక్ష్మీసరితారెడ్డి ఎంపికయ్యారు. ప్రపంచ అత్యున్నతస్థాయి ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ బ్యూటీ, పీఎంయూ కాంగ్రెస్ ఇండియన్ ఎడిషన్-2024కు చెన్నై వేదికగా పార్క్ హయాత్ హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలో పేరుపొందిన సియా ఎస్థటిక్ క్లినిక్, బ్యూటీ పార్లర్ యజమాని లక్ష్మీసరితారెడ్డి పాల్గొని ఈ అవార్డును అందుకున్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగిన డబ్ల్యూబీపీసీ పోటీల్లో ద బెస్ట్ ఎస్థటిషియన్‌గా ఆమె ఎంపికయ్యారు. ప్రపంచస్థాయి 18 దేశాల బ్యూటీషియన్లు పీఎంయూ కాంగ్రెస్ ఇండియా ఎడిషన్ 2024లో పాల్గొన్నారు. అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నటుడు హీరో విశాల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు లక్ష్మీసరితారెడ్డి తెలిపారు. అవార్డు రావడానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

క్యాట్ ఫస్ట్ లెవల్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు, ప్రిన్సిపాళ్లతో ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్యాట్ మొదటి లెవల్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని కమ్మభవన్ బ్రాంచ్‌లో విద్యార్థులతో కలసి విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్యాట్ మొదటి రౌండ్‌పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 4,250 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో 40 శాతం 1,700 మంది ప్రతిభ చూపి రెండో లెవల్‌కు అర్హత సాధించి, రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్డీఓ కార్యాలయం వెనుక ఉన్న తోటల్లో పేకాటస్థావరంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.44,600 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఈ దాడులు చేశామన్నారు. అరెస్టు అయిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పుట్లూరు: మండలంలోని రంగమనాయునిపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6040 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు.

ఆలూరులో నాకాబందీ

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో, గడ్డివాముల్లో తనిఖీలు చేశారు. ఇందులో వైసీపీ మద్ధతుదారుడు ఆలూరు రామచంద్రారెడ్డి ఇంటిపైన రెండు బ్యాగుల గులకరాళ్లు ఉండడంతో అతనితోపాటు ఆయన కుమారులు రామేశ్వరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బంధువులు లింగారెడ్డి, రాంమోహన్‌లపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

గొడ్డుమర్రిలో

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో శనివారం తెల్లవారుజామున సీఐ సత్యబాబు సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో ఎటువంటి మారణాయుధాలు లభించలేదని ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, సెల్‌ఫోన్, ఫ్లైవుడ్ దుకాణాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే అందరూ సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిషాపు వద్ద మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సేవాగుణంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.

యాడికి కేజీబీవీలో మంటలు

యాడికి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో గ్యాస్ లీకై పెద్దఎత్తున మంటలు వ్యాపించిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు అప్రమత్తమై మంటలు ఆర్పడంతో పెద్దప్రమాదం తప్పింది. పాఠశాలలో సాయంత్రం వంట చేస్తుండగా సిలిండర్ రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకైంది. మంటలు అంటుకొని పెద్దఎత్తున వ్యాపించాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది అతి కష్టం మీద మంటలను ఆర్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడానికి వచ్చిన పోలీసులు మంటలను ఆర్పడం గమనార్హం. సంఘటనలో ఎటువంటి నష్టం జరగలేదు.

జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సభ్యుడిగా రాము



బెళుగుప్ప, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి, సమన్వయ కమిటీ సభ్యుడిగా మండలంలో ఆవులెన్న సర్పంచ్, టీడీపీ నాయకుడు రామును నియమితులయ్యారు. జిల్లా పరిషత్ సీఈవో నుంచి ఈమేరకు నియామక పత్రాలు అందాయని రాము శనివారం ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి చొరవ చూపిన మంత్రి పయ్యావుల కేశవ్ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డులో ఉన్న రైల్వేగేట్ సమీపంలో శనివారం నరేష్ (23) అనే యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. పుట్లూరు మండలం చాలవేముల గ్రామానికి చెందిన నల్లయ్య, పుల్లమ్మ దంపతుల కుమారుడు నరేష్ తల్లిదండ్రులతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అతడు మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది శనివారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ స్థాయి సదస్సులో గేట్స్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

గుత్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులో పట్టణ సమీపంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటినట్లు కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ శనివారం తెలిపారు. కర్నూలులోని జీ పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జీగ్రాసా, టూకే24 జాతీయ స్థాయి సాంకేతిక సదస్సును నిర్వహించారన్నారు. ఇందులో 50 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అందులో గేట్స్ విద్యార్థులు తిలక్, సాయి, రేవంత్, రోహిత్‌కుమార్, మోనికా, సాయికుమార్, అఖిల, అనిల్‌కుమార్, బషీర్‌బాబు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. పేపర్ ప్రెజెంటేషన్‌లో తృతీయ బహుమతి, పోస్టర్ ప్రదర్శనలో ద్వితీయబహుమతిని, ఫొటో టైప్ డెవలప్‌మెంట్‌లో తృతీయ బహుమతి సాధించారన్నారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్ అభినందించారు.


శెట్టూరులో టీడీపీ కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


తాడిపత్రిలో సోమశేఖర్‌నాయుడుతో పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి


గుంతకల్లులో శాశ్వత సభ్యత్వాన్ని చేస్తున్న ఎమ్మెల్యే జయరాం తదితరులు


యల్లనూరు మండలం మేడికుర్తిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

కార్యకర్తలకు గుర్తింపు టీడీపీలోనే..

- పార్టీ సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, జేసీ అశ్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

శెట్టూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీలోనే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, పార్టీ కోసం పని చేసే ప్రతికార్యకర్తకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నాయకులు, కార్యకర్తలు చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త విధిగా రూ. వంద చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా చేస్తే రూ. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే సాధారణ మరణం సంభవిస్తే అంత్యక్రియలకు పార్టీ రూ.10 చెల్లిస్తుందని, కుటుంబానికి భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం పలువురికి సభ్యత్వాన్ని నమోదు చేయించారు. తర్వాత వాల్మీకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అక్కడే మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

తాడిపత్రి: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ తగిన గుర్తింపు ఇస్తుందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వనమోదును ఆయన పట్టణంలోని తన నివాసంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించిందన్నారు. ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి సోమశేఖర్ నాయుడుకు ఆయన సభ్యత్వాన్ని అందజేశారు.

గుంతకల్లు: కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు టీడీపీ తగిన గుర్తింపు ఇస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు కొండంత ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. కనుక ప్రతిఒక్కరూ సభ్యత్వాన్ని పొందాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు పార్టీ సభ్యత్వాలు తప్పక చేసుకోవాలని తెలిపారు. ఇది ఎంతో అండగా ఉంటుందని చెప్పారు. తర్వాత ఎమ్మెల్యేతో పాటు ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు బండారు ఆనంద్, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప ఒక్కొక్కరు రూ. లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. నాయకులు బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, పాల మల్లికార్జున, కొడెల చంద్రశేఖర్, గుజరీ మహమ్మద్ ఖాజా, టీ సరోజమ్మ, పెంచలపాడు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని మేడికుర్తిలో టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఇందులో 25మందికి సభ్యత్వాన్ని అందించారు. నాయకులు మేడికుర్తి రామకృష్ణారెడ్డి, క్లస్టర్‌కన్వీనర్ చల్లా చంద్రశేఖర్‌నాయుడు, నిట్టూరు సదాశివారెడ్డి, కల్లూరు జగన్, నిట్టూరు రామచంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

ఉరవకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు భారంగా ఉన్న విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం వద్ద శనివారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఇంధన సర్ధుబాటు పేరుతో ప్రజలపై రూ.6వేల కోట్ల భారం మోపడం అన్యాయమన్నారు. ట్రూఅఫ్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌నాయుడు, రంగారెడ్డి, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ పట్టణంలో సీపీఎం నాయకులు మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగికి వినతిపత్రం అందించారు. జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమిలినేనికి వైసీపీ శ్రేణుల ఘన స్వాగతం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శనివారం శెట్టూరు మండలకేంద్రానికి వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యేకు వైసీపీ నాయకులు సోమనాథ్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, వీరభద్ర, తిప్పేస్వామి, హనుమంతరాయుడు, వీరాంజనేయులుతో పాటు మరికొంతమంది పూలమాలలతో స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వైసీపీ శ్రేణుల కోరిక మేరకు ఎమ్మెల్యే స్థానిక ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని వైసీపీ నాయకులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే రూ. 50 వేలను విరాళం అందించారు. భవిష్యత్తులో మరింత సాయం చేస్తానని తెలిపారు. పార్టీలకతీతంగా సేవ చేయడమే కాకుండా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

బ్రిడ్జికి మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే

● కంబదూరు మండలంలోని జల్లిపల్లిలో ఇటీవల వర్షాలకు తెగిన బ్రిడ్జిని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శనివారం మరమ్మతులు చేయించారు. వర్షాలకు బ్రిడ్జి తెగిపోవడంతో జల్లిపల్లి మీదుగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెండు ఎక్సకవేటర్లను పంపించి ఆ బ్రిడ్జి మరమ్మతు చేయించి రాకపోకలకు మార్గం సుగుమం చేశారు.

కూలిన బ్రిడ్జి పరిశీలన

●కంబదూరు మండలంలోని నూతిమడుగు సమీపంలోని పెన్నా నదిపై ఉన్న బ్రిడ్జి ఇటీవల వర్షాలకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. శాశ్వత పరిష్కారం కోసం ఎంత నిధులు అవసరమో అంచనా వేసి ఉన్నతాధికారులకు తెలపాలని సూచించారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో బ్రిడ్జి నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పామిడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొరకాయలపేటకు చెందిన వరలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎంఆర్ఎఫ్ కింద రూ. 40వేలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ శనివా రం పామిడి పట్టణంలో ఆమె కుటుంబసభ్యుల కు అందజేశారు. అలాగే ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు ఓబుళప్పను ఈశ్వర్ వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. తర్వాత బీసీసీ రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలించారు. ఆయన వెంట తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, వైస్ ఎంపీపీ కాయల మహే ష్, మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్‌బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకుల బైండోవర్

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడ, పెద్దపొలమడ గ్రామాలకు చెందిన కొందరు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో వారిని శనివారం అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని రూరల్‌సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అనంతరం వారిని తహసీల్దార్ పూచీకత్తుపై వదలిపెట్టారని చెప్పారు.

క్రికెట్ టోర్నీలో తాడిపత్రి జట్టు విజయం

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జరిగిన అనంత ప్రీమియర్‌లీగ్ అండర్-16 బాలికల క్రికెట్ టోర్నీలో తాడిపత్రి బాలికల జట్టు విజయం సాధించినట్లు ఆర్డీటీ ఏటీఎల్ లలిత తెలిపారు. మ్యాచ్‌లో ఆత్మకూరు, తాడిపత్రి జట్లు పోటీపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 19.1ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తాడిపత్రి జట్టు 10 వికెట్ల తేడాతో 55 పరుగులు చేసి విజయం సాధించింది.

విధి నిర్వహణలో సెల్‌ఫోన్‌లు వాడరాదు

గుత్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది విధి నిర్వహణలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్లు వినియోగించరాదని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ చీటీలు ఇచ్చే సిబ్బంది, బీపీ చెక్ చేసే సిబ్బంది రోగులను క్యూలో నిలబెట్టి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యం వహించడంపై శనివారం ఆంధ్రజ్యోతిలో క్యూలో రోగులు ఫోన్‌లో సిబ్బంది అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఇందుకు మెడికల్ ఆఫీసర్ ఎల్లప్ప స్పందించారు. విధి నిర్వహణలో ఫోన్లు వినియోగించరాదని సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశారు.

కల్వర్టు పరిశీలన

బ్రహ్మసముద్రం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలోని సూగేపల్లి వంకలో జరుగుతున్న కల్వర్టు పనులను శనివారం టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, సర్పంచ్ వనతి, ఎంపీపీ వన్నూరుస్వామి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలోని ఆలూరు క్రాస్ వద్ద శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేశామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం తెలియడంతో వెంటనే సిబ్బందితో దాడి చేశామన్నారు. ఇందులో నంద్యాల జిల్లా అవుకు మండలానికి చెందిన డ్రైవర్లు శ్రీనివాసులు, మహేంద్రలను అరెస్టుచేసి కేసు నమోదుచేశామని చెప్పారు.

నిర్మాణ పనుల పరిశీలన

పెద్దవడుగూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కింద నిర్మిస్తున్న గోకులం షెడ్డు, గుండుపల్లి గ్రామం నుంచి భీమునిపల్లి వరకు నిర్మిస్తున్న బీటీరోడ్ల పనులను పీడీ సలీంబాషా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులను చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు విజయ్‌కుమార్, పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక

పెద్దవడుగూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మండలకేంద్రంలోని శ్రీ సరస్వతీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అశోక్, భరత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల కరెస్పాండెంట్ మారుతిప్రసాద్ తెలిపారు. ఆ విద్యార్థులను కరెస్పాండెంట్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మల్లికార్జున శనివారం అభినందించారు.

జీడిపల్లికి 1163 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1163 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,080 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

హెచ్చెల్సీలో పూడికతీత పనులు


కాలువలో పూడికతీత పనులు చేయిస్తున్న దృశ్యం

పుట్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామశివారులో ఉన్న హెచ్చెల్సీలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడిక, ముళ్లపొదల తొలగింపు పనులను శనివారం ప్రారంభించారు. పుట్లూరుకు చెందిన పుల్లారెడ్డి సొంత నిధులతో ఎక్సకవేటర్ పెట్టి కాలువలో ఉన్న ముళ్లపొదలను, పూడిక తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఈ పనులను సొంత నిధులను ఖర్చుచేసి చేయిస్తున్నామన్నారు. కాలువను శుభ్రంచేస్తే ఎక్కువ సమయం తీసుకోకుండా చెరువుల్లోకి నీరు వెళుతుందని పేర్కొన్నారు.

నీటి ఉధృతి తగ్గిన తర్వాతే కల్వర్టు నిర్మాణం


కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్లదేవనహళ్లి, బందూరు గ్రామాల మధ్యలో రోడ్డుపై ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. గత రెండేళ్ల క్రితమూ ఇదే పరిస్థితి నెలకొనగా.. అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ. 1.20 కోట్ల వ్యయంతో పునర్నిర్మించింది. కాగా ప్రస్తుతం అది మరో సారి వరదకు కొట్టుకుపోయింది. దీనిపై ఈ నెల 24 వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో రూ. 1.20 కోట్లు ఏటిపాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రవిశంకర్‌రెడ్డి శనివారం కూలిని కల్వర్టును పరిశీలించారు. మళ్లీ నిర్మించడానికి ఎంత ఖర్చు అవుతుందో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ప్రస్తుతం నీరు మరింత ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పనులు చేయలేమని, నీటి ఉధృతి తగ్గిన తర్వాతే నిర్మిస్తామని పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


రంగయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

యల్లనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్జాంపల్లికి చెందిన వైస్ ఎంపీపీ రంగయ్య కుటుంబాన్ని శనివారం ఉదయం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. 10 రోజులక్రితం రంగయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఇందుకు గాను పెద్దారెడ్డి శనివారం నీర్జాంపల్లికి వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రంగయ్య మరణం తీరనిలోటని తెలిపారు. ఆయన వెంట సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైసీపీ మండల కన్వీనర్ వెంకటేష్‌నాయుడు, నాయకులు వనం రవికుమార్, కల్లూరు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

హెచ్చెల్సీని పరిశీలించిన టీబీడ్యాం ఎస్ఈ

బొమ్మనహాళ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులో హెచ్చెల్సీ 105 కి.మీ. వద్ద నీటి గేజ్‌ను తుంగభద్ర జలాశయం ఎస్ఈ నీలకంఠారెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. తుంగభద్ర జలాశయం నుంచి ఆంధ్రా సరిహద్దు లోని బొమ్మనహాళ్ వరకు ఉన్న హెచ్చెల్సీ స్థితిగతులను ఆయన పరిశీలించారు. హెచ్చెల్సీలో నీటి లభ్యతపై అక్కడున్న అధికారులతో ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ ఇటీవల తెగిపోయి నీరు వృథా అయినప్పటికీ.. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో ఆశించిన స్థాయిలో వరదనీరు వచ్చిందని, దీంతో మళ్లీ జలాశయంలోకి నిండిందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ఆంధ్రా అధికారుల విన్నపం మేరకు హెచ్చెల్సీ దుస్థితిని బట్టి నీటిని ఇస్తున్నామని తెలిపారు. డ్యాం డీఈ నవీద, జేఈ అల్తాఫ్ ఉన్నారు.

విత్తనోత్పత్తి క్షేత్రం పరిశీలన

కణేకల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన వరివంగడాల ఉత్పత్తికి కృషి చేయాలని ఏడీఏ నారాయణనాయక్‌కు సూచించారు. ఈ క్షేత్రంలో దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో వరివంగడాల ఉత్పత్తి జరుగుతున్నందున , ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి సక్రమంగా పంట సాగయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫారం జూనియర్ అసిస్టెంట్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సహకార సొసైటీ తనిఖీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఉన్న వ్యవసాయ సహకార సొసైటీని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రసాయనిక ఎరువులు, మందులను అందించాలని సిబ్బందికి సూచించారు. ఎరువులను విక్రయించిన తర్వాత తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం సొసైటీలో ఏర్పాటు చేసి ప్రధానమంత్రి భారతీయ జన్‌ఔషధి యోజన సెంటర్‌ను పరిశీలించారు. ఏఓ సాయికుమార్, సీఈఓ హనుమంతు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీఓ వినూత్న అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆమె పౌరహక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై డివిజనల్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన సమస్యల్ని సభ్యులు పరిశీలించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిజనల్ స్థా యి సమావేశం నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక రకాల సంక్షేమ పథకాలను ఎస్సీ,ఎస్టీలకు అందేలా చూడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్టీ ఎస్సీ అట్రాసిటీ కేసులు ఉండటం దురదృష్టకరమన్నారు. డివిజన్ స్థాయిలో 21 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో వుండగా 107 కేసులు పెండింగ్ ట్రైల్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీడీపీవోలు, ఎన్జీవో మెంబర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోండి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరగనుందని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ సూచించారు. కళాశాలలో శనివారం ఆయన జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. హాజరయ్యే నిరుద్యోగ యువత విద్యార్హతల సర్టిఫికెట్లు తీసుకు రావాలన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ, ఏదైనా డిగ్రీ చదివి 18నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులన్నారు. జాబ్‌మేళా ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ రాకేష్, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్, ప్లేస్‌మెంట్ సెల్ శిక్షణ అధికారి బాలగంగాధర్‌తిలక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. పట్టణంలోని ఎస్కేపీ కళాశాలలో శనివారం ఫ్రేషర్స్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ముఖ్యంగా రోడ్డు, బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047కార్యక్రమంపై జరిగిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే ఎన్ఆర్ఐ చెట్టినాథన్ సహకారంతో ఉచిత పుస్తకాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

శెట్టూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగదీర్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బొచ్చుపల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్ శనివారం బైక్‌పై శెట్టూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. లింగదీర్లపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో శివకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోరం లేకుండానే మండల సమావేశం

బొమ్మనహాళ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి కొందరు ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ పద్మపై అసంతృప్తి కారణంగా డుమ్మా కొట్టారు. దీంతో సర్వసభ్య సమావేశం కోరం లేకుండా మొక్కుబడిగా ముగిసింది. ఎంపీపీ కేవలం ఇద్దరు సభ్యులతో సమావేశాన్ని మమ అనిపించారు. సమావేశం జరుగుతుందని ప్రజాప్రతినిధులందరికీ కొద్దిరోజుల కిందట ఎంపీడీఓ సమాచారం అందించారు. అయితే కొళగానహళ్లి ఎంపీటీసీ తిమ్మప్ప, ఉంతకల్లు ఎంపీటీసీ వనజాక్షి మాత్రమే హాజరయ్యారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులు ఎవరు రాకపోవడంతో 12 గంటలకు కోరం లేకుండానే ప్రారంభించారు. ఇదిలా ఉండగా పలువురు అధికారులు కూడా సమావేశానికి హాజరు కాలేదు. కోరం లేకుండా సమావేశం నిర్వహణపై ఇన్‌చార్జి ఎంపీడీసీ దాస్‌నాయక్‌ను వివరణ కోరగా కోరంకు సరిపడా సభ్యులు హాజరయ్యారని చెప్పారు.

మండల సర్వసభ్య సమావేశం

యాడికి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన సాధారణ మండల సమావేశాన్ని జరిగింది. ఇందులో అధికారులు వారిశాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. పలు సమావేశాల్లో ఈ అంశంపై ప్రతిపాదిస్తున్నా.. అధికారులు స్పందింకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓ కాశప్ప, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ మహబూబ్‌బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి, ఏపీఓ రమేష్, పీఆర్ జేఈ యల్లమనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవకుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

ఉరవకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.